

# అమ్మా! అమ్మా!

రామవరపు వేణుగోపాలరావు

**ఆత్మసంస్కారం కలవాడికి ప్రతి స్త్రీలోనూ మాతృమూర్తి కనిపిస్తుంది. చివరకు ప్రేయసిలోనూ, భార్యలోనూ కూడా . . . మాతృహృదయం లేని స్త్రీ ఆడదే కాదు. ఇల్లాలే కాదు. అసలైన తల్లి కాలేదు. అమ్మకోసం ఆవేదన చెందని జీవి ఉండదు. అమ్మ మమత జీవితంలో కొన్ని క్షణాలైనా పొందని మనిషి. . మనిషి అనిపించుకోడు. ఆ మమత, ఎంత ఎక్కువగా ఉంటే మనిషిలో అంత ఎక్కువ మానవత్వం ఉద్దీప్త మవుతుంది. పరిపూర్ణత సిద్ధిస్తుంది.**

రాంబాబు పాతికేళ్లవాడు. కలలుగనే కళ్లున్నవాడు. ఎల్లప్పుడూ పైజామా, లాల్చీ ధరించేవాడు. ఏ కులమూ, మతమూ లేనివాడు. మానవత్వమే, సమానత్వమే మతంగా గలవాడు. బి. ఎ. డిగ్రీ ఉన్నవాడు. ఓ ఆఫీసులో డిస్పాచింగ్ క్లర్క్ ఉద్యోగం కలవాడు. అతను ఒంటరివాడు. అతనికి ఈ భూప్రపంచంలో నా అని చెప్పుకోదగ్గవి చాలా తక్కువ ఉన్నాయి. వాటన్నిటిని ఎవరేనా వేళ్లమీద లెఖ్ఖ పెట్టగలరు. అతనికి చెంగల్రావుపేట కాదంబరి వారి వీథిలో చిన్న అద్దె గది ఉంది. ఆ గదిలో ఓ చిన్న టేబిలూ, నాలుగు కర్ర కుర్చీలూ, చిన్న కేంప్‌కాటూ, పెద్ద పుస్తకాల షెల్ఫు ఉన్నాయి. టేబిలుమీద అత నిమధ్యే కొన్న ట్రాన్సిస్టర్ రేడియో ఉంది. కుర్చీల మీద కాస్త దుమ్ము పేరుకుని ఉంది. కేంప్ కాట్ మీద బాగా మాసిన పరుపు మీద అంత బాగా మాయని దుప్పటీ ఉంది. తరవాత రెండు తలగడ దిళ్లున్నాయి. ఆ దిళ్లమీద తల పెట్టి కుడిచేత్తో సిగరెట్ పట్టుకుని వెల్లకిలా పరుండి గది పై కప్పు వేపు చూస్తున్నాడు రాంబాబు.

ఇల్లుగలవారి గోడ గడియారం ఠంగ్ ఠంగ్ మంటూ తొమ్మిది గంటలు కొట్టింది. ఆఖరుసారిగా మరో పీల్పు పీల్చి సిగరెట్‌ని అవతలకి విసిరివేశాడు రాంబాబు.

ఈవేళ ఎన్నడూ లేని నిస్పృహ అతన్ని విపరీతంగా కాల్చేస్తోంది. ఉదయంమంచీ దిగులుగా ఉంది. ఎందుచేతో అర్థంకావటం లేదు. అలా పడుకునే ఎదురుగా ఉన్న అద్దంవేపు చూసేడు. అద్దంలో ఒక్క రాంబాబు తలే ప్రతిఫలిస్తోంది. "ఎందు కలా ఉదయం నుంచీ విచారంగా ఉన్నావు!" అని మెల్లిగా ప్రశ్నించేడు. అద్దంలోని ప్రతిబింబం సమాధానం ఇవ్వలేదు. కాంతిలేని కళ్లతో రాంబాబు కళ్లలోకి గుచ్చిగుచ్చి చూడసాగింది. "పూర్ ఫెలో" అన్నాడు రాంబాబు మళ్లీ. ప్రతిబింబం మొదట్లోలాగే మెరుపూ జీవం లేని కంటిపాపలతో రాంబాబుని చూడసాగింది. హఠాత్తుగా తల పక్కకి తిప్పేసేడు రాంబాబు.

'ఇప్పుడు తొమ్మిది అయింది. పదింటికల్లా ఆఫీసులో నేనుండాలి. ఒక్క సెకండేనా అటూ ఇటూ కాకూడదు. ముక్కువాసన కొట్టే ఆ కాగితాల మధ్య ఓ యంత్రమైపోవాలి. సాయంకాలం అయిదున్నర వరకు అలాగే యాంత్రికంగా పని చెయ్యక తప్పదు. పని చేస్తున్నంతసేపూ నా ఆలోచనలు నన్ను వదలవు. నా ఒంటరితనం, నా నిరాశ, నా కులంలేనితనం నన్ను కాల్చక మానవు. పుట్టుకతోనే నేను అనాథుణ్ణి. అనాథ శరణాలయంలోనే పుట్టి పెరిగేను. నే నెవరికేనా నాథుణ్ణి కాగలనా? నన్నెవరు వరిస్తారు? టైపిస్ట్ సరోజ అయిదేసి నిమిషాలకి ఒకసారి నన్ను చూస్తోంటుంది. . . ఎందుకు చెప్మా? టైపిస్ట్ సరోజ బావుండదు. అందుకేనేమో ఇంకా పెళ్లీ పెటాకులూ కాలేదు. పోనీ — ఆ పిల్లని పెళ్లిచేసుకుంటే —? ఛ ఛ! అలా తినేసేలా చూసే ఆడదాన్ని ఎలా పెళ్లి చేసుకోవటం? అస లెందు కలా చూస్తోంది? ఆ చూపుల్లో చౌకబారుతనమేగదూ, ఉంది? తొందర పడకూడదు. స్టైనో అలివేలుమంగ బావుంటుంది. తెల్లగా పాలరాతిబొమ్మలా ఉంటుంది . . . ఎంతో హుందాగా నడుస్తోంది. నిర్మలమైన ఆమె మొహం చూస్తే చాలు గుండె నిండా ఏదో తెలీని గౌరవభావం నిండిపోతుంది. అలాంటి భార్య — అలివేలుమంగ నా భార్య — నా బెటర్‌హాఫ్ అయితే ఎంత బావుణ్ను! ఛ...ఛ... ఎంత నీతిమాలినవాణ్ణి! పెళ్లయిన వాళ్లని గురించి ఎంత నీచంగా ఆలోచిస్తున్నాను...? అలివేలుమంగకి పెళ్లి కాకుండా ఉంటే, పిల్లలు లేకుండా ఉంటే ఎంత బాగుణ్ను' అనుకుంటూ మరో సిగరెట్ వెలిగించేడు రాంబాబు.

పరికిణీ, జాకెట్టూ, వల్లెవాటూ ధరించిన అలివేలుమంగని కళ్ల ముందు గాలిలో సృష్టించడానికి ప్రయత్నించేడు. కాని, చీర కట్టుకున్న అలివేలుమంగే అతని ముందు ప్రత్యక్షమయింది. సన్నని చీర మడతల్లో వక్షఃస్థలంమీద మెరుస్తున్న మంగళసూత్రాలు, కాస్త

మీదుగా నల్లపూసల తాడు కనిపించేయి. ఘోరనేరం చేసినవాడిలా కళ్ళు గట్టిగా మూసుకుని, వాటిని ఎడంచేత్తో రుద్దుకున్నాడు.

'అలివేలుమంగ చక్కా పాడుతుంది. ఎంతో చక్కగా షార్ట్ హేండ్ డిక్టేషన్స్ తీసుకొంటుంది. ఇంకా ఎంతో చక్కగా నవ్వుతుంది. అలివేలుమంగ మొగుడు అనాకారి. కాని, అదృష్టవంతుడు!' అనుకొంటూ నిట్టూర్చేడు రాంబాబు. కళ్ళజోడు తీసి అద్దాలు తుడిచేడు. తుడిచేక మళ్ళీ పెట్టుకున్నాడు. చేతిలో కాలుతున్న సిగరెట్ వేపు చూసేడు.

'ఈ సిగరెట్ మరికొన్ని నిమిషాల్లో హరించుకు పోతుంది. మనిషి బతుకూ, నా బతుకూ అంతే. ముసలాడి నయ్యేలోగానైనా నేను ఆనందం చవి చూడగలనా? వెధవ — ఆ నూకరాజుగాడెంత అదృష్టవంతుడు! ఎస్సెల్సీ పేసయ్యేడు. మేనేజర్నీ, కంట్రాక్టర్ సింహాచలాన్నీ కాకాపట్టి మూడేళ్ల సర్వీసులోనే భలే ప్రమోషన్ కొట్టేసేడు. మేనేజర్ చవట. సింహాచలం చవటన్నర చవట! చవటలకే ఈ లోకంలో సునుగడ. తెలివైనవాళ్ళకీ — ప్రతిభ ఉన్న వాళ్ళకీ — ఎక్కడా ఎప్పుడూ విలువ లేదేమో! వాళ్ళ బతుకులే అంతేనేమో! నేనూ ఉన్నాను. ఉదయం నుంచీ సాయంత్రం ఆరు వరకూ ఒళ్ళు వంచి పని చేస్తాను. ఒక్క డిస్పాచింగ్ వర్కే కాదు, ఆఫీసులో ఏ సెక్షన్ పనేనా నాకు కొట్టిన పిండే. మరి నాకెందుకు ప్రమోషన్ రాలేదు? ఆ కాస్త ఆనందం కూడా నాకు దక్కాలని లేదన్నమాట! ఊహూఁ అదేం కాదు. అదంతా ఆ కంట్రాక్టర్ సింహాచలం పని. వాడూ, మేనేజరూ దొంగపీనుగులు. ఇద్దరు కలిసి నా పెర్సనల్ ఫైల్లో అవాకులూ చెవాకులూ గుప్పించేరు. నా భవిష్యత్తు సర్వనాశనం చేసేరు. కంట్రాక్టరు సింహాచలాన్నీ, మేనేజర్నీ చంపెయ్యాలి...'

రాంబాబు సిగరెట్ పెదవుల మధ్యకి తీసుకువచ్చి గుండెల నిండా పొగ పీల్చేడు. నోట్లోంచీ, ముక్కులోంచీ పొగ వదులుతూంటే చిన్న దగ్గు వచ్చింది. సగమేనా కాలని సిగరెట్ విసిరేసి ఆ చేత్తోనే గుండె రాసుకున్నాడు. 'దాహం వేస్తూంది' అనుకున్నాడు రాంబాబు. మంచానికి గజం దూరంలో స్టూల్‌మీద నీళ్ల కూజా ఉంది. కాని లేవడానికి బద్ధకం. మళ్ళీ తల తిప్పి ఎదురుగా ఉన్న అద్దం వేపు చూసేడు.

'ఏ జన్మలోనో చేసిన పాపాలకి ఈ జన్మలో శిక్ష అనుభవిస్తారట. నేనేదో జన్మలో తల్లినీ, పిల్లనీ విడదీసి ఉంటాను. దాహంతో అలమటించి పోతున్నవాడి చేతుల్లోని నీరు పారబోసి ఉంటాను. అందుకే ఇలా అనాథుణ్ణి అయ్యేను. తల్లి ఎవరో, తండ్రి ఎవరో తెలీదు. బతికి ఉన్నారో, లేదో తెలీదు. నాకో ఇంటి పేరేనా లేదు. నా పేరు రాంబాబు. వట్టి రాంబాబు. అంతే! మా అమ్మే ఉంటే?...అసలు మా అమ్మ ఎలా ఉంటుందో, ఎలా ఉండేదో! . . . మా అమ్మే ఉంటే నాకు మంచి అమ్మాయి నిచ్చి పెళ్ళి చేసి ఉండేది. నా పిల్లలతో ఆడుకుంటూ ఉండేది. . .'

"అమ్మా!"

అసంకల్పితంగా గట్టిగా అరిచేడు రాంబాబు.

అసలతనలా అరవాలనుకోలేదు. గుండె నిండా పేరుకున్న నైరాశ్యం, మనస్సులోని మహాంధకారం అతని శబ్దపేటికలోంచి ఆ మాటల్ని అప్రయత్నంగా రప్పించేయి. 'అమ్మా' అంటున్నప్పుడు అతని ఒళ్ళు ఒక్కసారి ఝల్లుమంది. ఒంట్లోని నరాలు విద్యుదాఘాతం తగిలినట్టు తిమ్మిరెక్కేయి. కళ్లముందు కాటుక లాంటి చీకటి పేరుకుంది. అప్పుడే అతని కళ్లలో గిర్రున నీళ్ళు కూడా తిరిగేయి. నీళ్ళు సుళ్ళు తిరుగుతూన్న కళ్ళతోనే గదిఅంతా ఓసారి పరికించి చూసేడు. కవ్వం తిప్పుతున్న తల్లి కొంగు పట్టుకుని నిలబడ్డ మురళీలోలుడు. పిల్లకాకి నోట్లో ఆహారం పెడుతున్న తల్లికాకి, ఆవు పొదుగుని కుమ్ముతున్న లేగదూడ, తల్లి కోడి చుట్టూ గునగునలాడుతున్న నాలుగైదు కోడి పిల్లలు, పార్వతీదేవి కుడి తొడమీద గణపతి, ఎడమ తొడమీద కుమారస్వామి మొదలయినవా రెందరో కన్పించేయతనికి మసక మసగ్గా. ఆ గోడమీది కేలండర్లన్నీ 'ఏదీ మీ అమ్మ? మీ అమ్మేదీ? ఏదీ? ఏదీ?' అన్నట్టు వేధిస్తూ చూసేయి.

'నాకు అమ్మ లేదు. ఉన్నా ఎక్కడుందో తెలీదు. నన్నిలా ఒంటరిగా బతకమని ఎందుకు శపించిందో తెలీదు. ఎలా ఉందో తెలీదు. ఎక్కడుంటుందో తెలీదు... ఏమీ తెలీదు...!'

"అమ్మా" అని మళ్ళీ గట్టిగా అరిచేడు రాంబాబు.

ఇల్లుగలవారి గోడ గడియారం ఠంగ్‌మంటూ మోగింది! తొమ్మిదిన్నర అయింది. మంచం మీద నించి లేచి పైజామా, లాల్చీ తొడుక్కున్నాడు. తల దువ్వుకుని చేతికి వాచీ కట్టుకున్నాడు. ఆకుచెప్పుల్లో కాళ్ళు దూర్చి గడపదాటి బైటికి వెళ్లేడు. గది తలుపుకి తాళం వేసి వీథిలోకి నడిచేడు. . .

అతనాఫీసులోకి వెళ్లేసరికి సరిగ్గా పది అయింది. ఎకౌంటెంటు ఆచారి ముక్కులోకి నశ్యం దట్టిస్తూ "ఏఁవోఁయ్, రాంబాబూ!" అంటూ పలకరించేడు. కేషియర్ రాజారావూ, గుమాస్తా సుబ్బారావూ అప్పుడే తమ సీట్లలో కూర్చొని పనులు చేసేసుకుంటున్నారు. మేనేజర్ గదిలో ఉన్నాడు గావును, బంట్రోతు రామయ్య చేతులు కట్టుకుని వినయంగా గది బయట నిల్చుని ఉన్నాడు. స్టెనో అలివేలుమంగ సీట్లో లేదు. ఆఫీసర్ ఛేంబర్స్‌లో డిక్టేషన్లు తీసుకుంటూ ఉందేమో! సరోజ అప్పుడే ఆఫీసు మెట్లెక్కింది. అందరికీ ఓ వరసని నమస్కారబాణాలు పారేసి, రాంబాబు మీద మాత్రం చిన్న మందహాసం చిలికింది. ఓ కన్ను మూసినట్టు ఎంచేతో అనుమానం వేసింది రాంబాబుకి. 'నిశ్చయంగా ఈవిడ చౌకబారు మనిషే. ఇలాంటి భార్యతో ఏ మగాడు వేగగలడు?' అనుకున్నాడు రాంబాబు. అనుకున్నాక తన సీట్లోకి పోయి కూర్చున్నాడు.

పాత కాగితాల ముతక వాసన... బిళ్లసిరా కంపు... బి. సి. నాటి రూళ్లకర్ర... పాతబడ్డ కలాలు... కంపు కొట్టే జిగురుసీసా... వీటి మధ్య ఫైళ్ళు... కళ్ల సహాయంతో రాంబాబు చేతులు అతని విధ్యుక్త ధర్మాన్ని నెరవేరుస్తున్నాయి. అతని చెవుల్లోమాత్రం అప్పుడే పుట్టిన లేగదూడ "అంబా" అన్న అరుపులు ప్రతిధ్వనిస్తున్నాయి.

'అన్నిటికీ మూలం అమ్మే. అమ్మ లేకపోతే జీవితంలో అందం లేదు. అమ్మ ఉంటే అన్నీ చూస్తుంది. అన్నం వండిపెడుతుంది. దాహం వేస్తే నీళ్లిస్తుంది. ఒంట్లో నలతగా ఉంటే ఆరాటపడుతుంది. గాభరా పడుతుంది. అమ్మ లేకపోవడం ఎంత దురదృష్టం!'

"రాంబాబుగారూ!"

చటుక్కున తల తిప్పి చూసేడు. ఆ కంఠం సరోజది. సగం సగం పైపు చేస్తూ ఆపేసి అతనివేపు నవ్వుతూ చూస్తూంది.

"తల్లిప్రేమ సినిమా చూసేరా?" అంది రహస్యంగా.

రాంబాబుకి తల్లి అన్న మాటే వినిపించింది. మిగతాది అర్థంకాలేదు. అయినా "లేదు" అన్నాడు.

"ఈవాళ చూద్దాం ఇద్దరం . . . ఏం?" అంది మళ్ళీ.

ఆమె ప్రశ్నకి జవాబివ్వడం మానేసి ఆమెవేపు మౌనంగా చూసేడు. ఎంత అనాకారికైనా యౌవనం వింత అందాన్నిస్తుందేమో! సరోజ నల్లగానే ఉన్నా, లక్షణంగా ఉంటుంది. ఆరోగ్యమైన శరీరం. మరి — ఆ వికార లక్షణాలేమిటి? సినిమాకి రమ్మనడం ఎందుకు?

"అలాగే. కానీ, మీకు అమ్మగారున్నారా?" అన్నాడు రాంబాబు అనాలోచితంగా.

సరోజ మొహంలోని నవ్వు హఠాత్తుగా మాయ




ఆ బట్టల దుకాణం పేరులో ఒక ముఖ్యమైన తప్పు ఉంది. ఆ పేరు 'సుబ్బయ్య అంగడి'. సుబ్బారావుగారు బట్టలు కొని దుకాణం యజమానితో "మీ దుకాణం పేరులో తప్పు ఉంది. దిద్దించరాదా?" అని అడిగారు.

సుబ్బయ్య — అదే సుబ్బయ్య గారు నవ్వి ఇలా అన్నారు: "ఆ తప్పు చూసి, దిద్దించమని నాతో చెప్పడానికి లోపలికి వచ్చిన వారిలో చాలామంది బట్టలు కొనిపోతూ ఉంటారండి!"



మైంది. "నా చిన్నప్పుడే మా అమ్మ చచ్చిపోయింది" అంది మెల్లిగా.

"సారీ."

ఒకవేళ సరోజగాని మా అమ్మ బతికేఉందంటే, ఆమెని ఓ మాట అని ఏడిపించాలనిపించింది రాంబాబుకి. "నాకు అమ్మ లేదు. మీ అమ్మగారిని 'అమ్మా' అని పిలిస్తే మీకేమేనా అభ్యంతరమా?" అంటే సరోజ ముఖం ఎలా వికృతంగా మారేదో!

'ఇదేమిటి నేనిలా మారిపోతున్నాను? ఎంతో మంచి వాణ్ణనిపించుకుంటున్న వాడినిగదా— ఇలా ఇంకోళ్లని బాధించాలని నాకెందుకనిపిస్తోంది? నా బాధని మర్చిపోవడం కోసమా? లేక నాలాగే ఎదుటివాళ్లూ బాధ పడాలనా? పోనీ, వాళ్ల బాధ చూసి ఆనందించాలనా? ఈ పైశాచిక ప్రవృత్తి చాలా ప్రమాదకరం!' అనుకుని రాంబాబు తల కిందికి దించేడు. తన పనిలో మునిగి పోయేడు. సరోజ వేళ్లు యథాప్రకారంగా కీబోర్డు మీద నాట్యమాడడం ప్రారంభించేయి.

. . . అలా నాలుగు గంటలు దొర్లేయి. మధ్యాహ్నం రెండయింది. లంచ్ తీసుకోవడానికని అందరూలేచారు. డైనింగ్ రూమ్ వేపు కొందరూ, కేంటీన్‌వేపు కొందరూ నడిచేరు. అలివేలుమంగ, సరోజలుమాత్రం తమ సీట్లోనే కూర్చొని ఇంటి దగ్గిర్నుంచి తెచ్చుకున్న టిఫిన్ కేరియర్లు విప్పుకుంటున్నారు. . .

రాంబాబు నీరసంగా లేచి కేంటీన్‌వేపు నడిచేడు. రకరకాల మనుష్యులతో నిండిపోయిన కేంటీన్ చేపల బజార్లా ఉంది. వాళ్ల కేకలికీ గోలకీ టాపు లేచిపోయేలా ఉంది. ఆఫీసర్లమీదా, ఎకౌంటెంట్లమీదా, హెడ్ గుమాస్తాల మీదా స్కేండల్స్ ఇక్కడే పుడతాయి. అవి ఆనోటా ఈనోటా పెరిగి పెద్దవై బహుళ జన ప్రచారాన్ని నోచుకుంటాయి. ప్రపంచంలోని రకరకాల రంగుల రాజకీయ పక్షాలకి సిద్ధాంతాలు అక్కడే సరఫరా చేయబడతాయి... కేంటీన్లో మూలగా ఉన్న ఓ టేబిలు దగ్గిర వెళ్లి కూర్చున్నాడు రాంబాబు. సప్లయర్‌తో స్ట్రాంగ్ కాఫీ తెమ్మని చెప్పేడు. అంతలో 'ఏమండీ, రాంబాబుగారూ!' అంటూ సుబ్బారావు వచ్చి అతని పక్కనే ఉన్న మరొక కుర్చీలో కూర్చున్నాడు. మౌనంగా ఓ నిమిషం కూర్చున్నాడు సుబ్బారావు. అంతలో హఠాత్తుగా రాంబాబుకి దగ్గిరగా జరిగేడు. ఏదో రహస్యం చెబుతూన్న వాడిలా మొహాన్ని ఇబ్బందిగా పెట్టేడు.

"రాంబాబుగారూ, మీరో చిన్న సహాయం చెయ్యాలి..."

"ఏమిటో చెప్పండి."

"చేస్తానంటే చెబుతాను."

"అదేమిటో చెప్పండి... చెయ్యగలిగితే చేస్తాను!" అన్నాడు రాంబాబు కరుగ్గా.

సుబ్బారావు కొన్ని క్షణాలు సందేహించేడు. అంతలో ఏదో నిశ్చయం చేసుకున్నవాడిలా దీర్ఘంగా నిట్టూర్చేడు.

"ఓ ఏభై రూపాయలు అర్జంటుగా కావాలి... ఆఖరి ఆసరాగా మిమ్మల్నే అడుగుతున్నాను. మీరు ఇవ్వనంటే మరి నా కెక్కడా డబ్బు పుట్టదు!"

'అదీ సంగతి... అప్పన్నమాట!' అనుకున్నాడు రాంబాబు. 'ఏభై రూపాయలూ ఎందుకు?' అని అడుగుదామనుకున్నాడు. కాని, సుబ్బారావు ఆ అవసరం రానియ్యలేదు. అప్పుడే సప్లయర్ తెచ్చిన కాఫీని రెండు చేసి తనోటి తీసుకుని, మరొకటి రాంబాబుకి ఇచ్చేడు.

"మా మదర్ నాకో హెడేక్‌గా తయారైందండీ... ఆవిడకిప్పుడు ఏనభై యేళ్లు. కూర్చుంటే లేవలేదు. లేస్తే కూర్చోలేదు. పైగా ఉబ్బసరోగమొకటి. ఎక్కడ లేని డబ్బూ ఆవిడగారి మందులకే సరిపోవటంలేదు. ఇటు పెళ్లాం సంగతే చూడ్డమా? అటు పిల్లల చదువులూ సంధ్యలూ చూడ్డమా? తల్లి రోగానికి మందులే కొనడమా? పిచ్చెక్కి పోతూందనుకోండి. మా మదర్‌కి ఉబ్బసమేకాకుండా టీబీ కూడా ఉన్నట్టు అనుమానంగా ఉందన్నాడు డాక్టరు. ఏవో ఎక్స్‌రేలూ గట్రా తియాలట. ఏం చెయ్యను చెప్పండి? మా నాన్నగార్లా తనూ తన తోవ చూసుకుంటే ఓ ఏడ్పు ఏడ్చి అవతలకి ఈడ్చేసేవాళ్లం. . . ఎవరికీ ఏ బాధాలేకుండా!"

అతనా మాటలంటూన్నంతసేపూ రాంబాబు అతని కళ్లలోకి తీక్షణంగా చూసేడు. ఆ కళ్లలో ఎక్కడా కన్నీటి చుక్కలేదు. వేదనలేదు. ముఖంలో విచారం లేదు. అసలు ఏ భావమూ లేకుండా నిర్వికారంగాఉంది. సుబ్బారావు అన్న మాటలు మరొక్కసారి గుర్తుకి తెచ్చుకున్నాడు రాంబాబు. 'హెడేక్ ... తల్లి రోగం... టీబీకూడా... ఓ ఏడ్పు ఏడ్చి ... ఈడ్చేసేవాళ్లం.'

సుబ్బారావుని ఓ గుద్దుగుద్ది చంపెయ్యాలనిపించింది రాంబాబుకి. తల్లిని గురించి అలాగేనా మాట్లాడేది...! ఆవిడది ఎంతహీనమైన బ్రతుకైతేనేమాత్రం... ఆ శరీరంలో ఎన్నిరోగాలుంటేమాత్రం ... నవమాసాలూ మోసి కనిపెంచిన తల్లి... హెడేకా? తలనొప్పా?



చిక్కు ప్రశ్నలు వెయ్యడంలో గణిత శాస్త్రజ్ఞులు నిపుణులు. ఒకాయన మూడు ప్రశ్నలు రూపొందించాడు. ఆతడి మిత్రుడు ఆ మూడు ప్రశ్నలతో ఒక అందమైన యువతిని పరీక్షించి విజయం సాధించాడు.

మిత్రుడు మొదట ఆ యువతితో ఇలా అన్నాడు: "మూడు ప్రశ్నలు వేస్తాను. మీరు సూక్ష్మంగా అవును అని కాని. కాదు అని కాని సమాధానం చెప్పాలి. మొదటి ప్రశ్న — ఈ ప్రశ్నకు, తరవాత ప్రశ్నకు మీరు నిజమైన సమాధానాలు ఇస్తారా?"

ఆ యువతి చిరునవ్వుతో అంగీకరించింది.

"రెండవ ప్రశ్న ఇది — నా మూడవ ప్రశ్న 'ఈవేళ రాత్రి నాతో విందారగిస్తారా?' అనేది అయితే మీరు ఈ ప్రశ్నకు ఇచ్చిన విధంగానే ఆ ప్రశ్నకు కూడా సమాధానం ఇస్తారా?"

రెండవ ప్రశ్నకు ఏలాంటి సమాధానం ఇచ్చినా మూడవ ప్రశ్నకు అవునని సమాధానం ఇవ్వడం తప్పదని ఆ యువతి గుర్తించింది. ఉభయులు కలిసి ఆ రాత్రి విందారగించారు.




పళ్ళు బిగించి, మనసులో 'రాస్కెల్' అనుకున్నాడు రాంబాబు. రాంబాబుకి బేంక్‌లో సేవింగ్స్ ఎకౌంటుంది. అందులో సరిగ్గా నాలుగు వేల రెండువందల ఆరు రూపాయల ఎనిమిది పైసాలు ఉన్నాయి. కాని — సుబ్బారావుకి ఎంచేతో డబ్బివ్వాలనిపించలేదు. సుబ్బారావు స్కౌండ్రల్. సుబ్బారావేగాదు, తల్లిని కించపరిచి మాట్లాడే ప్రతివాడూ స్కౌండ్రలే! అంతేకాదు. వాడో రోగ్! వట్టి రోగ్ కాజదు, డర్టీ యెన్ట్ రోగ్! అంచేత సుబ్బారావుకి డబ్బివ్వకూడ దనుకున్నాడు రాంబాబు.

"అమ్మగారిని గురించి అలా మాట్లాడుతున్నారేం? ఆవిడంటే మీకుమాత్రం అభిమానంలేదూ?" అన్నాడు రాంబాబు గ్లాసులోని కాఫీ కొంత చప్పరించి.

డొక్కుమొహం నాలుగు వంకర్లు పెట్టి ఏడుస్తూ నవ్వేడు సుబ్బారావు.

"ఎందుకు లేదూ? కొండంత ఉంది. కాని, వట్టి అభిమానం ఉండి ఏం ప్రయోజనం? నా అభిమానంతో ఆవిడికి మందులేం తేగలను? టానిక్కులేం కొనగలను? బత్తాయి లెవరిస్తారు? చాలీచాలనిజీతం రాళ్ళతో సతమతమే అవుతానా? అభిమానాలతో కడుపులే నింపుతానా? చెప్పండి. చావలేక బతుకుతూ ఆవిడా, బతకలేక ఛస్తూ నేనూ... ఇలా ఎంతకాలం?" అంటూ జేబులోంచి బీడీకట్టతీసి ఓ బీడీ వెలిగించేడు సుబ్బారావు.

"డబ్బేమీ వెనకెయ్యలేదా మీరు?" అన్నాడు రాంబాబు.

"అసలు — డబ్బు వెనకెయ్యాలన్న ప్రశ్నే ఉండేది కాదండీ. మొదట్లో మా నాన్న లక్షాధికారి. నే నొక్కడినే మగపిల్లణ్ణి. నా మీద ఇద్దరు ఆడపిల్లలు. ఆస్తంతా మా మదర్ పేరన రాసేసి మా ఫాదర్ చచ్చిపోయేరు. మా ఫాదర్ ఆస్తి లెలాంటివో చెబితే మీరు నమ్మరు. మా ఊళ్లో కొబ్బరితోటలు సగానికి సగం మావే. మెరకభూములు ఓ ఏభై ఎకరాలూ, పల్లపుభూములు ముప్ఫయ్ ఎకరాలు...ఊళ్లో మెయిన్ రోడ్లో అద్దెలు వచ్చే కొట్లు... మేడలు రెండు... నే నింకా పెద్దవాడిని కాకముందే మా మదర్ అన్నిటినీ అమ్మేసి మా సిస్టర్స్‌కి మేరేజెస్ గ్రేటా చేసింది. ఆడపిల్లలమీద మా అమ్మకి మహా మోజుండేదిలెండి! అంతా తీసుకువెళ్లి వాళ్ల ఎదాన కొట్టేది. నన్ను మాత్రం దౌర్భాగ్యుడిని చేసి వదిలింది. అంతకంతా అనుభవిస్తున్నది లెండి... ఆ ఆడపిల్ల లిప్పుడు మా మదర్ మొహమేనా చూడరు. రోగాలతోను, రొమ్ముల తోను, బాధపడుతున్నాది. కదాని... ఓ బత్తాయిపండేనా పంపించరు. ఏం చెప్పమన్నారు గురువుగారూ, ఇదీ పరిస్థితి!" అంటూ నిట్టూర్చేడు సుబ్బారావు. బీడీ కొసని పళ్లతో కొరికి పక్కనే ఉమ్మేడు.

సుబ్బారావు మాట్లాడుతున్నంతసేపూ అతన్నే నిశ్చలంగా చూసేడు రాంబాబు. అతను చెప్పింది నిజమా, అబద్ధమా అని కూడా అనిపించింది. ఎక్కడేనా అలాంటి తల్లి ఉంటుందా? తన కడుపున తన రక్తం పంచుకు పుట్టిన పిల్లల్నే వేరువేరుగా చూస్తుందా? ఏమో? తన కసలు తల్లే లేదుగా—తనకేం తెలుస్తుంది?

'పోనీ, అలాంటి తల్లి ఉంటుందే అనుకుందాం. కొడుకుని నిర్లక్ష్యంచేసి ఆడపిల్లలకి సరదా కొద్దీ ఆస్తి అంతా పెట్టిందే అనుకుందాం... అంతమాత్రాన

తల్లి అన్నది తల్లి కాకపోతుందా? ఎవరి సుఖాల కోసం వారు చూసుకునే ఈ రోజుల్లో తల్లీ తండ్రీ అన్నా అక్కా చెల్లీ తమ్ముడూ అన్న తాపత్రయా లుండవా? ఉంటేమాత్రం — వాటి మధ్య డబ్బు ప్రసక్తి విధిగా ఉండాలా? తల్లికిగాని — ఎవరికిగాని— డబ్బు పెడితేనే అనుబంధం ఉంటుందా? లేకపోతే ఉండదా? చెల్లెలికి ప్రతి పండుక్కీ పిల్చి చీరా జాకెట్టూ ఇస్తేనేనా తను అన్న అవుతాడు? లేకపోతే ఏమీకాడా? పవిత్రమైన ఈ బంధాన్ని... రక్తసంబంధాల్ని... పాడుచేసే శక్తి డబ్బుకే ఉన్నదన్నమాట!' అనుకుంటూ, సిగరెట్ పీలుస్తూ, కాఫీ తాగటం పూర్తిచేశాడు రాంబాబు.

"ఏమంటారు?" అని ప్రాధేయపడుతూ చూసేడు సుబ్బారావు.

"సారీ, సుబ్బారావుగారూ! మిమ్మల్ని చూస్తే జాలివేస్తూంది. కానీ — అయామ్ హెల్ప్‌లెస్. ఓ వారం రోజుల్లో నాకోదగ్గిరనించి డబ్బురావాలి. అదివస్తే తప్ప ప్రస్తుతం నేనేమీ ఇవ్వలేను" అంటూ, అక్కడితో ఆ ప్రసక్తి విరమించుకోమన్నట్లు సూచనగా లేచి నిలబడ్డాడు రాంబాబు. సుబ్బారావు దృష్టి ఎటో తిప్పి "ఫర్వాలేదు లెండి. అప్పుడే చూద్దాం!" అంటూ తనూ లేచేడు. ఇద్దరూ ఆఫీసువేపు మౌనంగా నడవ సాగేరు.

ఎందుచేతో రాంబాబు మనస్సు ఒక్కసారి కలుక్కు మంది. తప్పుచేశానా అని ఓ క్షణం పాటు తనుతాను ప్రశ్నించుకున్నాడు. తన దగ్గిర బోలెడంత డబ్బుంది. కాని, సుబ్బారావు ప్రవర్తనే బాగులేదు. వాళ్లమ్మగారిని గురించి అతవలా మాట్లాడి ఉండకపోతే తక్షణం రాంబాబు డబ్బిచ్చేవాడే! పోనీ —ఆ తరవాతనైనా ఒకసారి బతిమాలి ఉంటే, తప్పక ఇచ్చేవాడే! కానీ — ఎంత నిర్లక్ష్యం? "ఫరవాలేదు లెండి" అంటాడా? ఓ పక్క తల్లికి రోగం ముంచుకువస్తూంటే ఫర్వాలేదనా అంటాడు? డర్టీ రోగ్! ఇలాంటి వెధవకి డబ్బివ్వనే కూడదు!

ఆలా ఆలోచిస్తూనే తన సీట్లోకి వెళ్లి కూర్చున్నాడు రాంబాబు. అలివేలుమంగ టిఫిన్‌బాక్స్ డ్రాయర్లో పెట్టుకుంటూంది. సరోజ 'పఫ్'తో ముఖానికి పౌడర్ పులుముకుంటూంది. కంటి చివర్లనుంచి సుబ్బారావు వేపు చూసేడు రాంబాబు. అతను తల వంచుకొని తీవ్రంగా ఏదో డ్రాఫ్టు రాసేస్తున్నాడు... అతన్ని అలా చూస్తూంటే రాంబాబుకి మరో సంగతి మెరుపులా గుర్తుకి వచ్చింది. సుబ్బారావు వెధవే, సందేహంలేదు. పాపం, అతని తల్లేం చేసింది? ఒకరు చేసిన నేరానికి ఇంకొకరికి శిక్షా? వీడిమీద కోపంతో వీడికి డబ్బివ్వక మానేస్తే, బాధపడేది ఎవరు? వాళ్లమ్మేగా! ఆ మాట ఊహిస్తేనే రాంబాబుకి ఒళ్లంతా జలదరించినట్లు అనిపించింది. పోనీ, తనేవెళ్లి డబ్బిస్తే? ఇందాక డబ్బులేదన్నానే, ఇప్పుడెలా వచ్చిందని సుబ్బారావు ప్రశ్నిస్తే?

అంతలో మేనేజర్ గదిలోనించి బయటికి వచ్చాడు. తిన్నగా ఎకౌంటెంటు టేబులు దగ్గిరికి వెళ్లి ఏదో మాట్లాడి, వీధి గుమ్మం వేపు నడిచేడు. బయట సిద్ధంగా ఉన్న కారు అతన్ని ఎక్కించుకుని ఎటో వెళ్లిపోయింది. ఎకౌంటెంట్ ఆవారి ముక్కుపొడుం దట్టిస్తూ, మరో చేత్తో కళ్లద్దాలు సవరించుకుంటూ ఏదో ఫైలు అతి శ్రద్ధగా చూస్తున్నాడు... రాజారావు డ్రాయర్ సొరుగు సగంతీసి అందులో ఉన్న ఇంప్రెస్ట్ కేష్ లెఖ్క పెడుతున్నాడు. సుబ్బారావు ఓ చేత్తో తల గోక్కుంటూ మరో చేత్తో ఏదో డ్రాఫ్టు కాబోలు తయారుచేస్తున్నాడు... అలివేలుమంగ అయబద్ధంగా ఉత్తరాన్ని టైప్ చేస్తూంది. సరోజ చేతులుకూడా కీబోర్డు మీదనే ఉన్నాయి. కాని ఆమె మనస్సు మాత్రం ఆవిడదగ్గిర లేనట్టుంది. వాలు చూపులతో మాటిమాటికీ రాంబాబుని చూస్తూంది... ఓ పక్క కవర్లమీద అడ్రస్‌లు రాస్తూ — వాటిని వేయింగ్ మిషన్ మీద పెట్టి తూకం చూస్తూనే మరోప్రక్క ఆఫీసంతటిని పరికించసాగేడు రాంబాబు.

'ఈ ఆఫీసులో అందరికీ అమ్మ లున్నారు. అందరికీ ఓ చిన్న కుటుంబం, ఓ హేపీహోమ్ ఉండి ఉంటుంది. పగలల్లా పడిన శ్రమని మరిచిపోవడానికి వీలుగా ఇంట్లో ఎవరో ఒకరు ఆత్మీయులు ఉండి ఉంటారు... ఆవారి తల్లికి డెబ్భయ్ ఏళ్లట. ఆవిడంటే ఆవారికి కొండంత భయమని అందరూ చెబుతారు. రాజారావుకి తల్లీ దండ్రీ ఉన్నారు. కానీ ఈ ఊళ్లో లేరు. తల్లిని చూడ్డానికని రాజారావు ప్రతి ఆదివారం వాళ్ల ఊరు వెళ్లిపోతాట్ట. సుబ్బారావు సంగతి సరేసరి! అలివేలుమంగకి కూడా తల్లి అంటే ఎంతో గౌరవం. పాపం, సరోజకే తల్లిలేదు...! కాని సరోజ ఎప్పుడూ తుళ్లుతూ నవ్వుతూ ఉంటుంది. ఆమె ముఖంలో ఎప్పుడూ నైరాశ్యపు నీడలు కనిపించవు. తనకి తల్లిలేదన్న దిగులు కనిపించదు. కారణం? ఆమె తనలా ఆలోచించదా? ఎందుకాలోచించదు? ప్రపంచంలో — అంతవరకూ ఎందుకూ — ఈ ఆఫీసులో ఉన్న మిగతా వాళ్లలా నేనెందుకు సరదాగా ఉండలేక పోతున్నాను? అందరితో కలుపుగోరుతనంగా, చనువుగా మసలుకోలేకపోతున్నానెందుచేత? మొట్టమొదటి కారణం. నాకు తల్లిలేదు. తల్లి బిడ్డకిచ్చే అభిమానం, ఆదరణ, ఆప్యాయత, అనురాగం నే నెప్పుడూ పొందలేదు. దానికోసం పాతికేళ్లుగా వెంపరలాడుతున్నాను. ఆ కారణంగా, బహుశా నాలో ఏదో రకమైన మానసిక వ్యాధి నాకు తెలీకుండా వ్యాపించి ఉంటుంది. అందరూ నన్ను వెలివేసినట్టూ, ప్రపంచంలోని అందాల్ని అనుభవించే హక్కు నాకు లేనట్టూ బాధపడుతున్నాను. రెండో కారణం: నాకో కులం గోత్రం లేదు. నేనే కులానికీ గోత్రానికీ చెందను. అందుచేత ఎవరూ వీడు నా కులం వాడనో, నా జాతి వాడనో అనుకోడానికి కూడా అవకాశం లేదు. బ్రాహ్మణుడి నైతే ఆ బ్రాహ్మణులు అడుక్కి తొక్కేస్తారు. అబ్రాహ్మణుడినే అయితే బ్రాహ్మణులు వెలివేస్తారు. దేనికి చెందినా చిక్కే! చెందకపోయినా చిక్కే! చెందకపోతే వీడు కులంలేని మనిషి అంటారు. ఎలా చావడం? ఆదే కారణంగా నా కన్నా రెండేళ్లు జూనియరైనవాడు నాకు రావలసిన ప్రమోషన్ కొట్టేశాడు. శక్తివంచన లేకుండా పనిచేసినా అందులో ఎదుగూ, బొదుగూ లేకపోతే, ఎందుకీ ఉద్యోగం? ఎవరికోసం? ఆఫీసర్లకి తైర్లుకొట్టి, వాళ్ల పిల్లల్ని ఎత్తుకుని మోసి, వాళ్ల పెళ్లాల చీరలు, బట్టలు షాపుల్నించి ఇళ్లకి మోసి, వాళ్ల రికమెండేషన్లూ, అభిమానాలూ సంపాదించి, ప్రమోషన్లు సాధించి డబ్బు గడించి ఇలా దీనికి అంతేది? ఈ కృత్రిమమైన బతుకెలా గడపడం? ఈ ఆలోచనల వలనుంచి— ఈ చిత్ర హింసలనుంచి ఎలా తప్పించు


వాయిదాలమీద ట్రాన్సిస్టర్



ప్రపంచ ప్రసిద్ధమైన నేషనల్ డీలక్స్ 3 బాండ అఖిల ప్రపంచ పోర్టబుల్ ట్రాన్సిస్టర్. రు. 285/- ఖరీదయినది నెలసరి రు. 10/— ల వాయిదాల మీద పొందండి. ప్రతిపల్లెకు, బస్తీకి పంపపచుము. వ్రాయండి.

**IMPEX INDIA (WAP)**
**P. B. 1045, Delhi-6.**




**గజ్జి దురద**

మీ చర్మములోగల కోట్లకొలది సూక్ష్మరంధ్రములలో అనేక విధములగు క్రిమి జాలములు దాగియుండి చర్మమునకు దురద, పగుళ్లు, కలిగింపుటయేకాక గజ్జి, చర్మము రాలుట, చర్మము మంట, చీడ, తామర, పొక్కు, మొటిమలు, పాదములలో దురద, తదితర లక్షణములను పుట్టించును. సాధారణ చికిత్సల ద్వారా క్రిములు నశించకుండుటచే తాత్కాలిక ఉపశాంతి మాత్రమే కలుగును. శాస్త్రోక్తముగా తయారైన నిక్సోడెర్మ్ (NIXODERM)తో వెంటనే క్రిములు నశించుటయేగాక మీ చర్మము మృదువుగాను, శుభ్రముగాను ఉండుటకు యీ మందు తోడ్పడగలదు. చర్మ వ్యాధులకు కారకమైన క్రిములను నిశ్శేషముగా సంహరించు నిక్సోడెర్మ్ (NIXODERM)ను నేడే మీ కెమిస్టు వద్ద కొనండి.

దేహపుష్టికి
ఆరోగ్యానికి
పండిత-డి.గోపాలాచార్యులవారి
జీవామృతం
1898 నుండి ప్రసిద్ధి గాంచినది
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్)లిమిటెడ్
మదరాసు.17

నెలవరి రు. 10/-ల చెల్లుబడిమీద
ట్రాన్సిస్టర్ పొందండి

World
Famous
Powerfull
సరికొత్త జపాన్ మాడెల్ సొగసైనవూచీ. ఇవ్వబడిన "నేషనల్ 70" అఖిల ప్రపంచం 3 బాండ్ల ట్రాన్సిస్టర్—డయల్ లైటుతో ప్రతి పల్లెకు, పట్టణానికి పంపవచ్చును. త్వరపడండి.
WRITE YOUR LETTER TODAY
MUSIC & SOUND (N)
P. BOX 1576, DELHI-6

ఫోస్‌ఫోమిన్,
శక్తిని పెంపొందించును

ఆకలిని అధికముచేయును

సహనశక్తిని

హెచ్చించును,
శరీరముయొక్క రోగనిరోధక శక్తిని
ఎక్కువ చేయును
అవును —
కుటుంబము అంతటికి
ఫోస్‌ఫోమిన్
వల్ల ఆరోగ్యము కలుగును.


ఫోస్‌ఫోమిన్...బి కాంప్లెక్స్ విటమినులు మల్టివర్
గ్లిసరోఫోస్ఫేట్లు...ద్బ్రాగరో పోవ్ పేల్లుగం అనువచ్చుని వంద్ల రుచిగం టానిక్.
SQUIBB TTT
SARABHAI CHEMICALS
shilpi sc 50/67 Tel.

కోవడం? అమ్మలు లేని వాళ్లందరూ నాలాగే ఉన్నారా... ఎమో?'

. . . ఆఫీసు గడియారం ఆరు గంటలు చూపించసాగింది. ఒక్కొక్కరే లేచి ఆచారికి గుడ్‌నైట్ చెప్పి వెళ్లిపోతున్నారు. సరోజ ఒక్కర్తే మిగిలిపోయింది. టేబిలుమీద ఫైళ్లన్నీ గబగబ డ్రాయర్లో పెట్టి రాంబాబు లేచేడు. సరోజ కూడా దుకాణం కట్టేసి, హఠాత్తుగా లేచి నిలబడింది. . . ఇద్దరూ బయటికి నడిచేరు.

"సినిమా సంగతి ఏం చేసేరు?" అంది సరోజ.

అప్పుడే ముసురుకుంటూన్న చీకట్లలో ఆమె మొహం రాంబాబుకి స్పష్టంగా కనిపించలేదు. కాని ఆ గొంతులోని దీనత అతనికి విస్పష్టంగా వినిపించింది.

"సారీ, సరోజా. ఇవాళ నా మనస్సేం బాగాలేదు. మరోసారి వెళ్దాం. . . ఏమంటారు?"

"మనస్సు బాగాలేకపోతే సినిమాకి వెళ్లడమే మందు. కాసేపన్నా మనోవేదనలు మరిచిపోగలుగుతాం!"

"ఎక్కడికి వెళ్లినా, ఏం చేసినా నా మనోవేదన నాకు తప్పదు. అలా కాసేపు బీచ్‌లో కూర్చుంటేగాని మామూలు మనిషినికాలేను."

"పోనీ, నన్నూ బీచ్‌కి రమ్మన్నారా?"

"మీరా! ?"

"ఏం, అంత ఆశ్చర్యంగా అడుగుతున్నారేం?"

"అహా . . . మీరెందుకూ?"

"మీకు కంపెనీ ఇస్తాను. ఒంటరితనం చాలా భయంకరమైనది. నాకు తెలుసు."

"మీకెలా తెలుసు, మీరూ ఒంటరివాళ్లేనా?"

"కాకపోవచ్చు. మా ఇంట్లో నేనూ మా నాన్నా ఉంటున్నాం. కాని, ఆయనలోకం వేరు. నాలోకంవేరు. నా సరదాలూ అభిరుచులూ వేరు. ఆయన అభిప్రాయాలు వేరు. ఆయన కేవలం నాకు తండ్రి. అమ్మ దగ్గిర ఆడపిల్లకుండే చనువు తండ్రిదగ్గిరెలా ఉంటుంది?"

"మీరింటికి ఆలస్యంగా వెళితే ఆయనేమీ అనరా?"

"ఏమీ అనరు. ఆయనకి నా మీద ఎంతో నమ్మకం అభిమానం ఉన్నాయి."

"అదృష్టవంతులు."

"— అని మీరనుకుంటున్నారు . . . నేను చాలా దురదృష్టవంతురాల్ని."

"అదేం, అలా అంటున్నారు?"

"అదంతా చెబితే ఓ పెద్ద కథ. అసలు సంగతి చెప్పండి. నన్ను కూడా బీచ్‌కి రమ్మన్నారా?"

అలా మాట్లాడుతూనే ఇద్దరూ బస్‌స్టాప్ దగ్గిరికి వచ్చేశారు. స్టాప్‌లో జనం ఆట్టేలేరు. దూరంగా ఓ గుడ్డి కుర్రాడు ఏదో డబ్బా వాయిస్తూ తాజా సినిమా పాటలు పాడుతున్నాడు. వాడి ముందున్న చింకి గుడ్డ మీద ఏవో చిల్లర నాణేలు లైటువెలుగులో మెరుస్తున్నాయి.

"నేనంటే మీకెందుకింత ఆసక్తి?" అన్నాడు రాంబాబు హఠాత్తుగా.

"ఏమో. నాకు తెలీదు."

"నన్ను ప్రేమిస్తున్నారా?" అన్నాడు రాంబాబు జేబులోంచి సిగరెట్టు పెట్టె, అగ్గిపెట్టె పైకి తీస్తూ.

"అనే అనుకుంటున్నాను..." అంది.

"సరైన సమాధానం చెప్పండి" అన్నాడు రాంబాబు సిగరెట్ వెలిగించుకుంటూ.

"సరే — అవును."

"నా గురించి మీకేం తెలుసు?"

"తెలుసుకోకుండా, నే నెలా... ప్రేమించేననుకుంటున్నారు?" అంది సరోజ. తన మాటలు తనకే కొత్తగా వింతగా వినిపించినట్టు కాసేపు మౌనం వహించింది.

"నాగురించి ఏం తెలుసు?"

"చెప్పమన్నారా?" అంది అతని కళ్లలోకి గుచ్చి చూస్తూ.

"మీ పేరు రాంబాబు. ఒంటరిగా ఉంటున్నారు. మా వీథిలోనే ఉంటున్నారు. మీ ఉద్యోగం ఫలానా. మీ జీతం ఫలానా. మీరు మనసున్న మనిషి..."

"కాదు. అంతేకాదు. నేను వట్టి రాంబాబుని. కులంలేని మనిషిని. తల్లీ దండ్రీ ఉన్నా — లేనివాడిని. ఇంగ్లీష్‌లో బాస్టర్డ్ చైల్డ్‌ని. మానసిక వ్యథ శరీరం అంతా దొలిచేస్తున్నవాడిని. నవ్వడం చేతకానివాడిని. ఇది నిజం..."

పేలవమైన సరోజ ముఖంమీద అంతకన్నా పేలవమైన చిన్న చిరునవ్వు ఉదయించింది. "నాకుతెలుసు!" అంది.

"అయినా, నన్ను ప్రేమిస్తున్నారా?"

"అవును."

ఓ నిమిషంపాటు రాంబాబు మాట్లాడలేకపోయేడు. సరోజ ఈ విధంగా, నిజం తెలిసినా, సమాధానం చెబుతుందని అతనూహించలేదు. మాటలకోసం తడుముకోసాగేడు.

"థాంక్స్. మీ సాహచర్యం నాకేమేనా ఆనందం ఇస్తుందేమో నేనూ ఆలోచించుకోవాలిగా—"

"తప్పకుండా."

"నాకోరోజు టైమివ్వండి... రేపు సాయంకాలం ఏ సంగతీ చెబుతా."

"మీ ఇష్టం."

**ఈలోగా రొదచేస్తూ సిటీ బస్సు వచ్చింది. రాంబాబూ, సరోజా బస్సెక్కేరు. ఎవరి టిక్కెట్లు** వాళ్లే తీసుకున్నారు. బస్సు నడుస్తూన్నంతసేపూ సరోజ దొంగచూపులు రాంబాబుని చుడుతూనే ఉన్నాయి. . .


సిటీబస్సు ఒన్‌టౌన్ పోలీసుస్టేషన్ దగ్గిర ఆగింది. ఇద్దరూ బస్సు దిగేరు. మౌనంగా శివాలయం వీధిలోంచి బీచ్‌వేపు నడిచేరు రాంబాబు. అతను కనుమరుగయ్యే వరకూ వీధి గుమ్మంలో నిలబడి — తరవాత ఇంట్లోకి నడిచింది సరోజ.

. . . సముద్రం చాలా భయంకరంగా ఉంది. కెరటాలు అల్లకల్లోలంగా పడుతూ లేస్తూ ఉన్నాయి. వేసవికాలం అప్పుడే వచ్చేసినా, బీచ్ నిర్మానుష్యంగా ఉంది. పబ్లిక్ లేవరేటరీగా ఉపయోగపడే బీచ్‌లో సాయం విహారా లెవరు చేస్తారు? ఒడ్డునున్న రాళ్లల్లోంచి భరించరాని కంపు కొడుతూంది. . . అక్కడా అక్కడా రహస్య ప్రేమికులు చీకటి వీడల్లో అంతరంగ విషయాలు మాట్లాడుకుంటున్నారు. ఫ్రీమేసన్స్ లాడ్జి దగ్గిర మోటార్ సైకిలు పెద్దమనిషి, ఇంకా రాని ఆడగుమాస్తా కోసం ఎదురుచూస్తున్నాడు. గుడ్డి వెలుగులో నిలబడ్డ పాతబడ్డ టౌనుహాల్ పేకాట ఫ్రెండ్స్‌ని రమ్మని ఆహ్వానిస్తూంది. ఇంకాస్త నడిచి బీచ్ ఒడ్డునున్న ఓ రాయిమీద కూర్చున్నాడు రాంబాబు.

ఆకాశంలోకి చంద్రుడు అప్పుడే వచ్చేడు. వెన్నెల అంతటా వ్యాపించింది. వెన్నెల వెలుగులో కెరటాలు చెల్లాచెదరైన పులిపిల్లల్లా చిందులు వేస్తున్నాయి. ఆకలితో అరుస్తున్నాయి. రాంబాబు దీనంగా చంద్రుడినీ, సముద్రాన్నీ చూసేడు. ఆ ఇద్దరూ ఇచ్చే చల్లదనం రాంబాబుకి భౌతికంగానే ఉపయోగపడుతూంది. మానసికమైన రంపపుకోత చల్లదనంలో మరీ ఎక్కువవుతూంది. ఓ రెండు నిమిషాలపాటు కళ్లు మూసేడు.

"అయ్యా"—

రాంబాబు కళ్లు విప్పిచూసేడు. పుచ్చపువ్వులా ఉన్న వెలుగులో అతనికెదురుగా ఓ ఆరేళ్ల కుర్రాడూ — ఓ స్త్రీ నిలబడి ఉన్నారు. కుర్రాడి ఒంటిమీద నూలుపోగన్నా లేదు. వాడి చేతిలో ఒక గజం పొడవున్న కర్ర ఉంది. ఆ కర్ర అవతలి కొసని ఆ స్త్రీ పట్టుకుంది.




చిత్రం —ఎ. వి. మోహన్ గుప్త (విజయవాడ-1)

ఆ స్త్రీకి దగ్గిర దగ్గిర ముప్ఫయ్యేళ్లుంటాయి. రంగు తెలీని, చాలీచాలని చీరని శరీరానికిచుట్టుకుంది. చీర మోకాళ్లకిందకి దిగగానే లేదు. పైగా చిరుగులు. ఆమె ఒంటికి జాకెట్టు లేదు. పైట వక్షస్థలాన్ని పూర్తిగా కప్పలేదు. కుడిరొమ్ము అనాచ్ఛాదితంగా ఉంది. దృష్టి మరల్చి ఆ కుర్రాడివేపు చూసేడు రాంబాబు.

"కళ్లు కన్పించవ్ బాబూ, ఓ కానీ దర్మంసెయ్యండి బాబూ!" అంది ఆ స్త్రీ.

కుర్రాడు ఓ చెయ్యి ముందుకు చాచి దీనంగా చూస్తున్నాడు.

"మా అమ్మకి కల్లు ఆపట్టవ్ బాబూ — పైసా ధర్మం సెయ్యండయ్యా" అన్నాడా కుర్రాడు.

రాంబాబు జేబులో చెయ్యిపెట్టేడు. చిల్లరలేదు. ఒక రూపాయినోటు తీసి కుర్రాడి కివ్వబోయేడు. కాని, వాడది తీసుకోకుండా దాన్ని ఆశ్చర్యంగా చూడసాగేడు.

"తీసుకో..."

"కానీ ఇవ్వండయ్యా" అన్నాడా కుర్రాడు కీ ఇస్తే మాట్లాడే బొమ్మలా, నిర్వికారంగా.

"ఇది కూడా డబ్బే. తీసుకో."

"పుచ్చుకోరా అబ్బిగా. అయ్యగారు ధర్మాత్ములు. రూపాయనోటు ఇస్తున్నారు..." అందా స్త్రీ.

రాంబాబు నిర్ఘాంతపోయేడు. ఆ స్త్రీ చప్పున పైట సర్దుకుంది. 'ఎంతమోసం!' అనుకున్నాడు.

"తీసుకోరా అబ్బిగా."

వెంటనే రాంబాబు చేతిలోంచి ఆ కుర్రాడు నోటు తీసుకున్నాడు. కుర్రాడు ముందూ, తల్లి ఆ వెనకా టౌన్‌హాలు వేపు నడవసాగేలరు... తనని మోసం చేసినందుకు వాళ్లమీద కోపం రాలేదతనికి. వాళ్లని చూస్తూ విషాదంగా నవ్వుకున్నాడు. 'తల్లి ఎంత మంచిది. ఎంత ఓపిక ఉంటుందామెలో! ముష్టెత్తో — మోసంచేసో, ఒళ్లు వంచో — ఎలాగో ఒకలా కన్నబిడ్డని సాకుతుంది. ఆ మమకారం ఆమెచే ఎన్నిపన్లేనా చేయిస్తుంది' అనుకున్నాడు రాంబాబు.

బీచ్‌రోడ్డు దాదాపునిర్జనంగా ఉంది. శిథిలమైన ఆ రోడ్డు మీదకి వాహనాలేవీ రావటం లేదు. సముద్రం హోరుతప్ప మరేమీ అతని చెవుల్లో ప్రతిధ్వనించటంలేదు... ఉక్కిరి బిక్కిరయ్యే ఆలోచనలతో కనుచూపు మేరలోనైనా కాంతి పొడచూపని భవిష్యత్తుని ఊహిస్తూ శిలలా అక్కడ కూర్చుండిపోయేడు రాంబాబు... సెకన్లు... నిమిషాలు... గంటలు ... అలా దొర్లిపోసాగేయి.

అంతలో పాత లైట్‌హౌస్‌నుంచి ఓ కారు మహా స్పీడుగా వస్తూండటం గమనించేడు. ఎందుకో ఆ తొందర? క్షణం క్రితం మెరీనా హోటలు దగ్గిరున్న కారు మరుక్షణంలో అతని ముందునుంచి సాగిపోయింది. టౌనుహాలు పక్కనున్న రోడ్డు మలుపు తిరగబోయి— పెద్ద చప్పుడుచేస్తూ కారాగిపోయింది. అదే క్షణం భయంకరమైన కేక వినిపించింది. ఆ కేక విని ప్రత్తుగా నిలబడ్డాడు రాంబాబు. కారు అతనికి ఇరవై గజాల దూరంలో ఉంది. గబగబ అటు నడిచేడు.

కారు సర్రున రేవర్స్‌గేర్‌లో మూడు గజాలు వెనక్కి వచ్చి సర్రున ముందుకి సాగిపోయింది. అంతా రెండు క్షణాల్లో మెరుపు మెరిసినట్టు జరిగింది. ఆ

కొద్దిపాటి కాలంలో — ఆ కారులో ఉన్న మనిషినీ, ఆ కారునీ గుర్తు పట్టేడు రాంబాబు. అటునుంచి దృష్టి మరల్చి రోడ్డువేపు చూసేడు. ఏదో ఆకారం గిలగిల కొట్టుకుంటూంది. కమేలాలో మెడ తెగిపడ్డ మేక గుర్తు వచ్చింది రాంబాబుకి...

ఎదురుగా రక్తపు మడుగులో పొర్లాడుతున్న ఎవరో స్త్రీ. . .

ఒక్క క్షణం ఆలోచించేడు రాంబాబు. . .

ఏం చెయ్యడం...?

పోలీసులకి రిపోర్టు ఇవ్వడమా? ఏమని? ఫలానా కంట్రాక్టర్ సింహాచలం తాగుడు మైకంలో కార్ని ఇష్టం వచ్చినట్టు నడిపి ఓ అభాగ్యురాల్ని మట్టించేశాడనా? పోలీసులు తన మాట నమ్ముతారా? సింహాచలం దేన్నైనా మసిపూసి మారేడుకాయ చెయ్యగలడు. హత్యలు అతనికో లెఖ్ఖకాదు. దీనినించి తప్పించుకోవడం అతనికో పెద్ద సమస్యా కాదు.

మరేం చెయ్యడం? మరొక్క నిమిషం పాటు ఆలోచించేడు రాంబాబు. ఆలోచనలతో ఆ ఒక్క నిమిషం అతని మస్తిష్కం చురుగ్గా పనిచేసింది.

నెత్తుటి మడుగులో పొర్లాడుతూన్న ఆ స్త్రీని మరోసారి చూసేడు. రాత్రి పది దాటింది. అందుచేతే జనంకూడా చుట్టుపట్ల ఎవరూ లేరు. నేలమీద కూర్చొని రెండు చేతులతోను ఆమెని ఎత్తుకున్నాడు. అక్కడికి అతని గది కాస్త దూరమే! పెద్ద పెద్ద అంగలు వేస్తూ పరిగెత్తేడు. తలుపుతీసి తన మంచం మీద ఆమెని పడుకోబెట్టేడు. పక్కింటి కుర్రవాడి ద్వారా ఆ వీథిలోనే ఉన్న డాక్టర్ పార్వతిని అర్జంటుగా రమ్మని కబురంపించేడు.

మంచం దగ్గిర ఉన్న కుర్చీలో కూర్చుని ఆమె వేపు చూసేడు రాంబాబు. ఆవిడకి దాదాపు ఏభై ఏళ్లుంటాయేమో! లేదా ఇంకా ఎక్కువే ఉండచ్చు. ముఖంలో వార్థక్యంకన్నా దారిద్ర్యం నడిచిపోయిన ఛాయలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. తల నుంచి ఇంకా రక్తం కారుతూనే ఉంది. ముఖంలో సంస్కారవంతుల లక్షణాలున్నాయి గాని, కట్టుకున్న బట్టలు, లేమిని చూపిస్తున్నాయి. 'పాపం, ఎవరో బిచ్చగత్తె. ఈమెకి పిల్లలు ఉండి ఉంటారు. మరైతే, వాళ్లేరీ? ఓ పక్క మృత్యువు తరుముకు వస్తూన్నా — ముఖంలో ఎంత దయ ఉంది? ఎవరీమె?... ఏమో... నా తల్లేనేమో... ఏమో. ఎందుక్కాకూడదు?' అనుకుంటూ పక్కకి తిరిగేడు రాంబాబు.

డాక్టర్ పార్వతి ఇంకా రాలేదు.

'అబ్బ — ఏమిటీ ఆలస్యం?'

మంచంలో ఉన్న ముసలిది హఠాత్తుగా కళ్లు తెరిచింది. ఆత్రతగా అటు నడిచేడు రాంబాబు.

"ఎలా ఉందమ్మా ఒంట్లో?" అన్నాడు కంగారుగా.

"నాకా... ఏమైంది నాకు...?" అందామె మెల్లిగా వణుకుతూన్న గొంతుకతో.

"ఓ వెధవ కారు స్పీడుగా వచ్చి మిమ్మల్ని మట్టించేసేడు. మీరు కారు కింద పడగానే వాడు పారిపోయేడు. ఇది మా ఇల్లు. డాక్టర్ గారికి కబురంపించేను. రెండు నిమిషాల్లో వచ్చేస్తారు. మీవాళ్లెవరేనా ఉన్నారా? కబురు పెట్టమన్నారా?"

ఆ వృద్ధురాలు తల ఎత్తబోయింది. పెదవులు అల్పంగా కదిలేయి. కంఠంలో ఏదో అడ్డుపడినట్టు చిన్న మూలుగు వినిపించింది.

'భగవాన్, మాట పడిపోయింది' అనుకున్నాడు రాంబాబు.

కాంతిలేని కళ్లతో, వణుకుతూన్న పెదవులతో, రక్తంతో బీభత్సంగా తయారైన నుదుటితో ఉన్న ఆమెని చూస్తూంటే రాంబాబు గుండె తరుక్కుపోసాగింది. ఆమె ముఖంలో మృత్యువు నీడలు కన్పించసాగేయి. జీవం ప్రాణం లేని కళ్లతో రాంబాబుని చూస్తూందామె. ఏదో మాట్లాడ్డానికి ప్రయత్నిస్తూంది... ఏమిటది...? రాంబాబు గుండెలో కోటి కోటి సముద్రాలు తుపానులు సృష్టించేయి ఒళ్లు స్వాధీనం తప్పి తేలిపోసాగింది. కళ్లలో నీళ్లు ఉప్పెనగా ముంచుకు వచ్చేయి. గొంతు గాద్గదికమైపోయింది. మంచం మీద చేతులు రెండూ వేసి ముందుకివంగేడు రాంబాబు. సూటిగా ఆమె ముఖంలోకి చూసేడు.

"అమ్మా — మీకేం ఫర్వాలేదు. డాక్టర్ గారు ఇప్పుడే వచ్చేస్తారు. ... ఏం ఫర్వాలేదు" అన్నాడు.

ఆ మాటలు విననట్టే ఉందామె. ఏదో చెప్పాలని తపన. ఏదో ఆరాటం. కదలలేని అశక్తత... గొంతు పెగల్చలేని అసమర్థత... ఆమెని ఆవరించుకున్నాయి. ఏం చెయ్యడానికీ మాట్లాడడానికీ తోచక శిలలా మౌనంగా నిలబడ్డాడు రాంబాబు... అంతలో డాక్టర్ వచ్చింది. చుట్టుపక్కల వాళ్లు కూడా చాలా మంది చేరేరు. ఆ వృద్ధురాలి పరిస్థితి రకరకాల వ్యాఖ్యానాలు... సానుభూతి వాక్యాలు వెలరేగేయి.

"సారీ మిస్టర్ రాంబాబూ! షీ యీజ్ డెడ్!"

పిడుగు పడ్డట్టు కంపించిపోయేడు రాంబాబు.

షీ యీజ్ డెడ్... డెడ్... డెడ్!

"నిజమేనా?"

అవును. నిజం. ఆమె చచ్చిపోయింది.

ఆమె శరీరంలో ప్రాణాల్లేవు.





విశ్రాంతి — ఫోటో — దేవరకొండ భద్రాజీ (మద్రాసు-17)

షి ఋాజ్ డెడ్!

అపనమ్మకంగా అటువేపు చూసేడు రాంబాబు. ఆమె కళ్ళు తెరుచుకుని ఉన్నాయి. వాటి దృష్టి శూన్యంలో. ముఖంమీద నిర్వికారం. పాలిపోయిన పెదవులమీద అవ్యక్తమైన మందహాసం. నుదుటి మీద అనంతమైన జాలి...

అవును.

ఆమె చచ్చిపోయింది.

చుట్టూ మూగిన జనం మెల్లిమెల్లిగా సర్దుకున్నారు. కాసేపటికి ఇంటిగలాయనా, రాంబాబూ అక్కడ మిగిలేరు.

"ఎవరు బాబూ, ఈవిడ?"

జవాబిచ్చే ముందు రాంబాబు చాలాసేపు ఆలోచించేడు. దుఃఖంతో పూడుకుపోయిన కంఠంతో "మా అమ్మ" అన్నాడు.

"మీ అమ్మా? !"

"అవును."

"ఏమైందసలు?"

"బీచ్ రోడ్డంట వస్తూంటే కారు కిందపడింది.."

"ఆ కారెవరిదో తెలుసా?"

"... తెలీదు!"

"పోలీస్ రిపోర్టిద్దామా?"

"ఊఁ"

'ఊఁ' అన్నాడే కాని — తనేం మాట్లాడుతున్నాడో — ఏం చేస్తున్నాడో రాంబాబుకి తెలీదు... ఇల్లుగలాయన వెళ్ళిపోయేడు. పోలీసులు వచ్చి ఏవో ప్రశ్నలు వేసేరు... ఏదో స్టేట్‌మెంటు తీసుకున్నారు...

రాత్రల్లా జాగరణ.

ఎవరో స్త్రీ... చనిపోయిన స్త్రీ మీద తనకెందుకీ ఆసక్తి? తనవరో — ఆమె ఎవరో!

'ఒకవేళ మా అమ్మే ఈ స్థితిలో ఉంటే ఎవరు చూస్తారు? భగవాన్, మా అమ్మకిలాంటి నికృష్టమైన చావెన్నడూ రాకూడదు!'

ఆ మరునాడు...

ఆఫీసుకి సెలవు పెట్టేసేడు. ఏ మధ్యాహ్నానికో శవాన్ని పాడెమీద పెట్టడం గమనించేడు. ఎవరో ముందుకి తోస్తున్నట్టు శవం వెనక స్మశానానికి అన్యమనస్కంగా నడిచేడు... పేర్చిన చితిమీద శవం పెట్టేరు... రాంబాబు తలకొరివి పెట్టేడు .. అగ్ని నాల్కలు చాచింది... మంటలు చెలరేగేయి... ఆ మంటల్లో గడ్డకట్టిన రక్తం మరుగుతూన్న చప్పుడు ఎముకలు పేలుతున్న ధ్వని... అన్నీ విన్నాడు. జుత్తు కాలిన వాసన... చీర కాలిన వాసన.. అన్నీ అనుభవించేడు. ఆ అనుభవంలో ఆ గగుర్పాటులో, అతని గుండెలోని కన్నీటి చెరువు గట్టు తెగింది కట్టుతప్పి నీటి ఉప్పెన కళ్ళలోంచి ఉరికింది. అలా గుండె ఖాళీ అయ్యే దాకా, మంటలు చల్లారేదాకా, మౌనంగా రోదిస్తూ నిలబడ్డాడు రాంబాబు.

అప్పుడే అతను తన మనస్సులో ఓ గట్టి నిశ్చయం చేసుకున్నాడు! ఇకనుంచీ తనకి తల్లిలేదని వేదన చెందకూడదు. ప్రతీ స్త్రీలో మాతృమూర్తిని చూసి గౌరవించాలి. . . ఆ క్షణం నుంచీ అతని హృదయం తేలికైంది.

ఆ రాత్రి — కొన్ని సంవత్సరాలుగా నిద్రకి వెలి అయిన రాంబాబు గాఢంగా సంతృప్తిగా నిద్రపోయేడు ఉదయాన్నే లేచి వేళవగానే, ఆఫీసుకి వెళ్ళేడు అటెండెన్స్ రిజిస్టర్లో సంతకం పెట్టి తన సీట్లో కూర్చున్నాడు. చేస్తూన్న పని ఆపేసి నవ్వుతూ రాంబాబుని పలకరించింది సరోజ. ఆ నవ్వు అతని కళ్ళముందు ఏవో అందమైన లోకాల్ని తెరిపించింది.

చిన్న కాగితం ముక్క మీద ఏదో రాసి సరోజవేపు విసిరేడు రాంబాబు. అది చదివిన సరోజ ఈ సారి నవ్వలేదు. సిగ్గుతో బంతిమొగ్గ అయింది. కళ్ళు నిమీలితాలు చేసి ఆ కాగితమ్ముక్కని ఆప్యాయంగా జాకెట్లో దోపుకుంది .! ★